# వైకల్యం గల వ్యక్తుల చట్టం 2016



# గ్రామ స్థాయి శిక్షకుల కరదీపిక

## భాగం – 1



కీ॥శే॥ శ్రీ జావేద్ అబిది (53),

భారతదేశంలో వికలాంగుల హక్కుల సాధనకై తీవ్రంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి. అన్ని రకాల వికలాంగుల సంఘాలను, సంస్థలను ఏకం చేసి డిసేబుల్డ్ రైట్స్ గ్రూప్‌ని స్థాపించి **1995**లో సమాన అవకాశాల చట్టాన్ని సాధించారు. ప్రపంచ స్థాయిలో వికలాంగుల హక్కుల కోసం పోరాడుతూ అంతర్జాతీయ వికలాంగుల సంఘంనకు అధ్యక్షులుగా రెండుసార్లు ఎన్నికయ్యారు. దశాబ్దాల ఆయన పోరాటంలో వికలాంగుల లెక్కింపు, పంచవర్ష ప్రణాళికలో వికలాంగుల అంశాల చేర్పు, ఐక్యరాజ్యసమితి వికలాంగుల హక్కుల ఒప్పందం అమలుతో పాటు నూతన వికలాంగుల హక్కుల చట్టంకై నిరంతరం పోరాడి సాధించారు.

ఈ శిక్షణ కార్యక్రమం సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ, మన చట్టపర హక్కులను గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేసి వికలాంగుల సంపూర్ణ సాధికారతకు కృషి చేద్దాం.

# పరిచయం

**2007లో భారత ప్రభుత్వం ఆమోదించిన ఐక్యరాజ్య సమితి వికలాంగుల హక్కుల ఒప్పందం (యు.న్.సి.ఆర్.పి.డి) స్ఫూర్తితో వికలాంగుల హక్కుల చట్టం 2016ను భారత పార్లమెంట్ ఆమోదించింది. ఏప్రిల్ 19, 2017 నుండి అమలుకై రాష్ట్రపతి ఆమోద ముద్ర పడింది. ఈ చట్టం ఏప్రిల్ 19, 2017 నుండి దేశమంతటా అమలులోకి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టంలోని అన్ని హక్కులని అమలు చేడయం వారి బాధ్యత.**

## ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం ఆధారంగా ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశాలు:

ఎ) వ్యక్తిగత హోదాకు గౌరవం, సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ, వ్యక్తిగత స్వతంత్రత కల్పించడం.

బి) ఎటువంటి వివక్ష చూపకపోవడం.

సి) అందరితో సమానంగా సమర్థవంతంగా, సమాజంలో పూర్తి స్థాయిలో భాగస్వాములవ్వడానికి వీలు కల్పించడం.

డి) వ్యక్తులలో వుండే తేడాలను, వైకల్యాన్ని మనుషుల మధ్య ఉన్న తేడా, మానవతా పరంగా ఉండే వైవిధ్యంలో భాగంగా చూసి అంగీకరించడం, గౌరవించడం.

ఇ) సమాన అవకాశాలు.

ఎఫ్) అవకాశాల అందుబాటు.


జి) స్త్రీ, పురుషులు మధ్య సమానత.

హెచ్) వైకల్యం గల పిల్లల్లో రూపొందుతున్న సామర్థ్యాల పట్ల గౌరవము మరియు తమ ఉనికిని కాపాడుకునేందుకు వైకల్యంగల పిల్లలకు గల హక్కుల పట్ల గౌరవము.

## ఈ చట్టంలో అంతకు ముందున్న 7 రకాలను కలుపుకొని మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించారు. (Section 2 – ZC)



1. చలన వైకల్యం




2. కుష్ఠు వ్యాధి నయమైన వారు



3. మెదడు పక్షపాతం




4. మరుగుజ్జుతనం (147 సెం॥మీ॥ల కంటే తక్కువ ఎత్తు ఉండడం)




5. కండరాల బలహీనత



6. ఆమ్ల (ఆసిడ్) దాడి బాధితులు



7. పూర్తి చూపు లోపం



8. తక్కువ చూపు లోపం



9. మాట, వినికిడి లోపం



10. మాట, భాష వైకల్యం



11. మేధోపరమైన వైకల్యం




12. నేర్వడంలో నిర్దిష్ట వైకల్యం



13. ఆటిజం (ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్)
('మూగ వ్యాధి')



14. మానసిక రుగ్మత



15. దీర్ఘకాలిక నరాల సంబంధిత వైకల్యం



16. నరాల తొడుగు సంబంధ వ్యాధి



17. తలసీమియా (రక్త దోషం)



18. హీమోఫిలియా (రక్తం గడ్డకట్టకపోవడం)



19. సికిల్ సెల్ (రక్తహీనత) వ్యాధి.



20. పార్కిన్‌సన్ (నరాల బిగుసు) వ్యాధి



21. బహుళ వైకల్యం (పై ఏవేని రెండు లేదా అంత కన్నా ఎక్కువ)

**గమనిక:** 40 శాతం వైకల్యం అంత కంటే ఎక్కువ వైకల్య శాతంతో అధికార ధృవీకరణ పత్రం వున్న వికలాంగులు ఈ చట్టంలో వున్న అన్ని హక్కులు పొందుటకు అర్హులు. (షెడ్యూల్ చూడండి)

# అద్యాయం 2 : హక్కులు - ప్రయోజనాలు

**హక్కులు ప్రయోజనాలన్నీ సమానత్వంతోను - పక్షపాత రహితంగాను వుండాలి.**

వికలాంగులు తమ హక్కులు పొందే విధంగా కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి. హక్కులు, సమానత్వం, గౌరవప్రదమైన జీవితం, ఇతరులతో సమానంగా గౌరవంగా జీవించడానికి తగిన హక్కులు పొందేందుకు ప్రభుత్వాలు బాధ్యతతో ఈ క్రింది చర్యలు చేపట్టాలి:

- సామర్థ్యాన్ని పెంచుకొనుటకు పరిస్థితులు కల్పించాలి.
- వైకల్య కారణంగా తక్కువ చూపు చూడకూడదు.
- వైకల్య కారణంగా వ్యక్తిగత స్వేచ్ఛ హరించరాదు.
- అనువైన వసతి సౌకర్యాలు కల్పించాలి.

# వైకల్యం గల మహిళలు - పిల్లలు



- వైకల్యం గల మహిళలు - పిల్లలు అందరితో సమానంగా అన్ని హక్కులు అనుభవించే రీతిలో **ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి.**
- వైకల్యం గల పిల్లలు తమ జీవితాలను ప్రభావితం చేసే అంశాలపైన తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచే హక్కును తప్పకుండా **ప్రభుత్వాలు కల్పించాలి.**

# సెక్షన్ 5 : సామాజిక జీవనం

## క్రూరమైన, అమానుషమైన ప్రవర్తన నుండి రక్షణ



- వైకల్యం గల వ్యక్తులను ఏ రీతిలోనైనా / ఏ పద్ధతిలోనైనా హింసించడం, క్రూరంగా ప్రవర్తించడం, అగౌరవంగా ప్రవర్తించడం వీటిని నిరోధించుటకు **ప్రభుత్వం చర్యలను తీసుకోవాలి.**
- అనుమతి లేకుండా పరిశోధనలు చేయడం, దాడి చేయడం, అవమాన పరచడం, బెదిరించడం, ఆహారం ఇవ్వకపోవడం, లైంగికంగా వేదించడం, అనుమతి లేకుండా గర్భస్రావం చేయడం, అంగీకారం లేకుండా సంతాన నిరోధ వైద్య చికిత్సలు చేయించడం వంటివి **శిక్షార్హమైన నేరాలు.**
- చట్ట ప్రకారం పై నేరాలకు 5 సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించబడును.

- వైకల్యం గల వ్యక్తులకు సమాజంలో **జీవించే హక్కు వుంది.**
- వైకల్యం గల వ్యక్తుల ఈ క్రింది స్థితిగతులను కలిగి ఉండేందుకు సంబంధిత **ప్రభుత్వం కృషి చేయాలి**
  - ❖ ఒకే ప్రత్యేకమైన నివాస ప్రదేశంలో ఉండాలని నిర్బంధించకూడదు.
  - ❖ **తమ వయసు, లింగం పట్ల తగిన శ్రద్ధ చూపుతూ, జీవనానికి అవసరమైన పద్ధతుతో కూడి వ్యక్తిగత సేవలతో పాటు, తగినంత గృహ వసతి మరియు ఇతర కమ్యూనిటీ సేవలను అందుబాటులో ఉంచాలి.**



## వేదింపులు, హింస, దోపిడీల నుండి రక్షణ

వైకల్యం గల వ్యక్తులకు అన్నివిధాలైన వేదింపులు, హింస, దోపిడీల నుంచి రక్షించేందుకు **ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.**



1. న్యాయపరమైన చర్యలు చేపట్టాలి.
2. అలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలి.
3. రిపోర్ట్ చేయడానికి తగిన అనుకూల పద్ధతులు విధించాలి.
4. బాధితులను రక్షించేందుకు, కాపాడేందుకు తగిన పునరావాసాలు చేపట్టాలి.
5. ప్రజలకు తగిన సమాచారం అందించి, విస్తృత అవగాహన కల్పించాలి.
6. ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు పొందుటకు తగిన సహాయక బాధ్యతలు చేపట్టాలి.

7. అఘాయిత్యాలకు గురైనట్లు, గురి కాబోతున్నట్లు భావిస్తే, ఆ సమాచారాన్ని స్థానిక కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకు (కలెక్టర్‌కు) అందించాలి.

8. సమాచారం పొందిన కార్యనిర్వహక మేజిస్ట్రేట్ అఘాయిత్యాలు నిరోదించేందుకు చర్యలు చేపట్టి వైకల్యం గల వ్యక్తికి రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీచేయాలి.

9. వికలాంగులు పట్ల వేదింపుల నుండి కాపాడేందుకు వికలాంగులకోసం పనిచేస్తున్న సంస్థలకు వారి సంరక్షణ, పునరావాసం కోసం ప్రభుత్వం అధికారాలు ఇవ్వాలి




10. బాధితులు కోరితే భద్రత, అవసరమైన సదుపాయాలు కల్పించాలి.

11. ఈ చట్టం ప్రకారం పోలీసులు చర్యలు తీసుకునే బాధ్యత నుండి తప్పించుకోలేరు.

12. ఉచిత న్యాయం పొందే హక్కు వుంది.

## రక్షణ - భద్రత

1. ప్రకృతి వైపరీత్యాల నుండి మరియు ఇతర ప్రమాద పరిస్థితుల నుండి వైకల్యం గల వ్యక్తులకు ఇతరులతో సమానంగా రక్షణ, భద్రత కల్పించాలి.
2. ఏదైన విపత్తు లేదా ప్రమాదం సంభవించినపుడు వైకల్యం గల వ్యక్తుల భద్రత, రక్షణ కోసం చేపట్టే విపత్తు యాజమాన్య నిర్వహణ పనులలో వికలాంగులకు భాగస్వామ్యం కల్పించాలి.





## గృహం – కుటుంబం

వైకల్యం కారణంగా బాలికలను, వారి తల్లిదండ్రులను వేరు చేయకూడదు. అవసరమైన పరిస్థితులలో కోర్టు ఆదేశాల మేరకు వేరుచేయాలి.



## పునరుత్పత్తి హక్కులు

వైకల్యం గల వ్యక్తులకు సంతాన ఉత్పత్తి, కుటుంబ నియంత్రణ విషయంలో తగిన సమాచారంపై అవగాహన కల్పించాలి.





## ఓటు హక్కు సౌకర్యం

వైకల్యం గల వ్యక్తులు పోలింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు అనువైన ఏర్పాట్లు చేయాలి. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని రకాల సామగ్రిని వైకల్యం గల వ్యక్తికి అర్థం అయ్యే రీతిలో అందుబాటులో ఉంచాలి.

## అందుబాటులో న్యాయం

- వైకల్యం గల వ్యక్తులు ఏదేని కోర్టు, ట్రిబ్యునల్, కమీషన్ లేదా జుడిషియల్, క్వాసి – జుడిషియల్ అధికారం లేదా విచక్షణాధికారం ఉన్న ఏ సంస్థనైనా ఆశ్రయించిన విషయంలో వారి చట్టబద్ధ హక్కులకు ఎటువంటి భంగం కల్గకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.
- వైకల్యం కారణంగా హక్కులకు భంగం కల్గకుండా, ఎటువంటి వివక్షకు తావు లేకుండా చూడాలి.



## న్యాయ సామర్థ్యం

- వైకల్యం కలిగిన వ్యక్తులు సొంత ఆస్తి, పిత్రార్జితం అయిన ఆస్తి, ఇతరత్రా స్థిర, చరాస్తులు కలిగి వుండడం, తమ ఆర్థిక వ్యవహారాలు నియంత్రించుకోవడం, బ్యాంకు ఋణాలు, తాకట్టు ఇతర రూపాలలో వుండే ఆర్థిక పరమైన లావాదేవీలు పొందడం విషయంలో, సమాజంలో అందరితో సమానమైన హక్కులు కల్గి వుండేందుకు చర్యలు తీసుకోవాలి.
- జీవితానికి సంబంధించిన అన్ని విషయాలలోను వైకల్యం గల వ్యక్తులు సమాజంలోని అందరితో సమానంగా చట్టబద్ధమైన హక్కులు కల్గి వుండటం. చట్టం ముందు అందరి మాదిరిగా సమాన గౌరవ ప్రతిపత్తి గుర్తింపు పొందడానికి అవసరమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి.

## సంరక్షణ బాధ్యతలు కల్పించడం

- వైకల్యం గల వ్యక్తి చట్టబద్ధ నిర్ణయాలు తీసుకోలేనపుడు, అటువంటి వ్యక్తులతో సంప్రదించి ప్రభుత్వం పొందుపరచిన నిర్దేశాల మేరకు వికలాంగుల తరపున చట్టబద్ధ నిర్ణయాలు తీసుకోవడానికి పరిమిత అధికారం కలిగిన సంరక్షులను ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

- అవసరమైన సందర్భాలలో కోర్టు లేదా సముచిత అధికారాలు కల్గిన సంస్థ, పూర్తి సహాయం అవసరం అయిన వైకల్యం గల వ్యక్తుల కోసం పూర్తి స్థాయి సంరక్షణ బాధ్యతలను అందించే ఏర్పాటు చేయవచ్చు.

# అధ్యాయం - 3

## విద్యా సంస్థల బాధ్యత

ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సహాయం పొందుతున్న సంస్థలు లేదా ప్రభుత్వం గుర్తించిన అన్ని విద్యా సంస్థలలోను వైకల్యం గల పిల్లలకు, మిగతా పిల్లలతో కలసి సమ్మిళిత విద్య అందించేలా ఏర్పాట్లు చేయాలి. ఈ దిశగా ఈ క్రింది చర్యలు చేపట్టాలి.

1 వివక్ష లేకుండా ప్రవేశాలు కల్పించడం, అందరితో సమానంగా విద్య, వినోదాత్మక అవకాశాలు కల్పించడం.

2 భవనాలు, ప్రాంగణాలు, ఇతర వస్తులన్నింటినీ వైకల్యం గల పిల్లలకు అనువుగా అందుబాటులో వుండునట్లు చూడాలి.

3 వైకల్యం గల పిల్లల వ్యక్తిగత అవసరాలకనుగుణంగా సౌకర్యం కల్పించాలి.



4 సంపూర్ణ సమ్మిళిత విద్యా లక్ష్యాన్ని చేరుకోవడానికి, గరిష్ట స్థాయిలో విద్యా సామాజిక అభివృద్ధి ప్రమాణాలను, వ్యక్తిగత ఇతర అవసరాలను తీర్చేలా సహాయం అందించాలి.

5 చూపులోపం లేదా వినికిడి లోపం లేదా ఈ రెండు వైకల్యాలు గల పిల్లలకు అవసరమైన భాష సమాచార పద్ధతుల ద్వారా ఉత్తమ విద్య అందించాలి.

6 నేర్చుకునే నైపుణ్య లోపం (స్పెసిఫిక్ లెర్నింగ్ డిసేబిలిటీస్) గల పిల్లలను గుర్తించి వాటిని అధిగమించడానికి అవసరమైన చర్యలు చేపట్టి, అనువైన విద్యా బోధనలు పాటించాలి.

7 వైకల్యం గల ప్రతి విద్యార్థి చదువులో పాల్గొనే తీరు, ప్రతిభపరంగా సాధించే ప్రమాణాలు, చదువును పూర్తి చేయడం వంటి అంశాలను నిరంతరం ప్రభుత్వం పర్యవేక్షించాలి.

8 వైకల్యం గల పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించాలి. మరియు అధిక మద్దతు (హై సపోర్ట్ నీడ్స్) అవసరం గల పిల్లలకు సహాయకులను ఏర్పాటు చేయాలి.

## సమ్మిళిత విద్యను మెరుగుపరుచుటకు నిర్దిష్ట చర్యలు

ప్రభుత్వం, స్థానిక సంస్థలు ఈ క్రింద తెల్పిన చర్యలు తీసుకోవాలి.

ఎ) వైకల్యం గల పిల్లలను గుర్తించడం, వారి ప్రత్యేక అవసరాలపై ఒక అంచనాకు రావడం, ఆ అవసరాలు ఏ మేరకు తీర్చబడుతున్నాయి అని తెలుసుకోవడం కోసం, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి స్కూల్‌కు వెళ్లి పిల్లలపై సర్వే చేపట్టాలి. ఇలాంటి తొలి సర్వే, చట్టం ప్రారంభం అయిన **రెండేళ్లలో పూర్తి చేయాలి.**






బి) తగినన్ని ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు ఏర్పాటు చేయాలి.

సి) సంజ్ఞా బాష, బ్రెయిలీ లిపిలో అర్హత గల వైకల్యం గల ఉపాధ్యాయులను, మానసిక వైకల్యం గల పిల్లలకు చదువు చెప్పడంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాలి.

డి) పాఠశాల విద్యకు సంబంధించి అన్ని స్థాయిల్లో సమ్మిళిత విద్యను బోధించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి.

ఇ) అన్ని స్థాయిలలో విద్యా సంస్థలకు మద్దతిచ్చునట్లుగా అవసరమైనన్ని రీసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలి.

ఎఫ్) మాట, భాషా, సమాచార పరంగా వైకల్యాలు గల వ్యక్తులు సమాజంలో అందరిలాగా సమానంగా పాల్గొనేటట్లు, వారి ప్రగతికి దోహదపడటానికి, దైనందిన అవసరాలను తీర్చుడానికి, వారి అవసరాలకు తగినట్లుగా బ్రెయిలీతో పాటు సంజ్ఞా భాషను, ఇతర సమాచార పద్ధతులను వాడాలి. ఇతర ప్రత్యామ్నాయ సమాచార విధానాలను ప్రోత్సహించాలి.

జి) వైకల్యం గల విద్యార్థులకు 18 సం॥రాలు వచ్చేంత వరకు వారికి అవసరం అయిన పుస్తకాలు, శిక్షణా సామగ్రి, సహాయ పరికరాలు ఉచితంగా అందించాలి.

హెచ్) వైకల్యం గల విద్యార్థులకు అవసరం అయిన సందర్భాలలో ఉపకార వేతనాలు ఇవ్వాలి.

ఐ) వైకల్యం గల పిల్లల అవసరాలకనుగుణంగా పాఠ్యాంశాలు, పరీక్ష పద్ధతులలో తగిన మార్పులు చేయాలి. పరీక్ష పూర్తి చేయడంలో కొంత అదనపు సమయాన్ని ఇవ్వాలి. సహాయకులను నియమించుకొనే విధంగా వెసులుబాటు కల్పించాలి. సెకండ్ లాంగ్వేజ్, థర్డ్ లాంగ్వేజ్ నుండి వారికి మినహాయింపు ఇవ్వాలి.

జె) వైకల్యం గల వ్యక్తులు మరింత నేర్చుకోవడానికి, వారికి నేర్పించడానికి అవసరమైన పరిశోధనలను ప్రోత్సహించాలి.

## వయోజన విద్య

సమాజంలో మిగతా వయోజనుల మాదిరిగానే వైకల్యంతో వున్న వ్యక్తులు కూడా వయోజన విద్య, నిరంతర విద్యా కార్యక్రమాలలో పాల్గొనేలా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలి.



# అధ్యాయం - 4

# నైపుణ్యాల అభివృద్ధి మరియు ఉపాధి

## వృత్తి శిక్షణ - స్వయం ఉపాధి

వైకల్యం గల వ్యక్తులకు వృత్తి శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వారికి తగిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించి ఋణ సదుపాయం ఏర్పాటు చేసి వడ్డీపై రాయితీ కల్పించి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలి.





ఎ) వైకల్యం గల వ్యక్తికి అన్ని రకాల వృత్తినైపుణ్య శిక్షణా పథకాలలో ప్రవేశం కల్పించాలి.

బి) వైకల్యం గల వ్యక్తి నిర్దిష్ట శిక్షణ పొందేందుకు తగిన మద్దతు సౌకర్యాలు పొందేలా చూడాలి.

సి) వైకల్యం గల వ్యక్తులలో అభివృద్ధిపరమైన మేథోపరమైన బహుళ వైకల్యాలు, అటిజం గల వారికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అమలు చేయాలి. మార్కెట్‌కు అనుసంధానించాలి.

డి) వైకల్యం గల వ్యక్తుల ప్రత్యేక శిక్షణ, స్వయంఉపాధి కార్యక్రమాల ప్రగతిపై సంపూర్ణ సమాచారాన్ని ఎప్పటికపుడు రూపొందిస్తూ వుండాలి.





## ఉద్యోగంలో వివక్ష చూపకుండుట

1 ఉపాధి అవకాశాలకు సంబంధించి వైకల్యం గల వ్యక్తి పట్ల ఏ ప్రభుత్వ సంస్థ, ఎలాంటి వివక్షనూ చూపరాదు.



2 ప్రతి ప్రభుత్వ సంస్థ, వైకల్యం గల ఉద్యోగులకోసం వారికి అనువైన వసతి, ఎటువంటి అవరోధాలు లేని పని వాతావరణం కల్పించాలి.

3 ఒక ఉద్యోగి తన సర్వీస్ కాలంలో ప్రమాదవశాత్తు వైకల్యానికి గురైతే, తన పదవిని రద్దు చేయడం కాని, హోదా తగ్గించడం కాని చేయకూడదు.

4 ఉద్యోగి వైకల్యానికి గురైన తర్వాత ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి పనికిరాని పక్షంలో, అదే వేతన స్కేలు, సర్వీస్ ప్రయోజనాలు కలిగిన మరో ఉద్యోగానికి మార్చాలి.

5 వైకల్యం గల వ్యక్తిని వేరే ఉద్యోగంలో సర్దుబాటు చేయడం సాధ్యం కాని పక్షంలో, అతనికి ప్రత్యేక స్థాయిని ఏర్పాటు చేసి తగిన మరో ఉద్యోగం దొరికే వరకు లేదా పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు (రెండింటిలో ఏది ముందు జరిగితే అప్పటి వరకు) ఆ స్థాయిలోనే కొనసాగించాలి.

## సమాన అవకాశాల విధానం

ప్రతి సంస్థ కూడా తను పాటించే సమాన అవకాశాల విధానాన్ని ప్రకటించాలి. ఆ క్రమంలో తీసుకొనే చర్యలన్నీ అందులో వివరించాలి. దాని ప్రతిని స్టేట్ కమీషనర్ వద్ద నమోదు చేయాలి.

## రికార్డుల నిర్వహణ:



1 ప్రతి సంస్థ కూడా తన దగ్గర పనిచేసే వికలాంగ ఉద్యోగులకు సంబంధించిన వివరాల రికార్డులను నిర్వహించాలి. వారికి కల్పించిన సౌకర్యాల వివరాలను, అవసరమైన ఇతర సమాచారంతో కూడిన రికార్డులను నిర్వహించాలి.

2 ప్రతి ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో వైకల్యం గల నిరుద్యోగుల జాబితాను పొందుపరచాలి.

## ఫిర్యాదులు, సత్వర చర్యల అధికారి నియామకం

1 అన్ని ప్రభుత్వ సంస్థలు, ఫిర్యాదుల పరిష్కార అధికారి (గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఆఫీసర్)ని నియమించాలి. అట్టి నియామక వివరాలను స్టేట్ కమీషనర్‌కు పంపించాలి. ఈ అధికారి తన వద్దకు వచ్చే ఫిర్యాదులన్నింటినీ, ఫిర్యాదు నమోదైన నాటి నుండి 2 వారాలలోపు పరిశీలించి తగిన దిద్దుబాటు చర్యను సూచిస్తూ సంస్థలోని పై అధికారులకు ఆ విషయం తెలియజేయాలి.



# అధ్యాయం – 5

# సామాజిక భద్రత, ఆరోగ్యం, పునరావాసం, వినోదం

## సామాజిక భద్రత:

- సముచిత ప్రభుత్వము, తనకున్న ఆర్థిక స్తోమత, అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా వైకల్యం వున్న వ్యక్తులు, స్వతంత్రంగా జీవనం కొనసాగించడానికి దోహదపడేలా అనువైన పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలి. అలాంటి పథకాలు, కార్యక్రమాలకు మామూలు వ్యక్తులకిచ్చే సహాయం కన్నా కనీసం 25% ఎక్కువ సహాయం అందించాలి.
- ఇలాంటి పథకాలు రూపొందించేటప్పుడు వికలత్వం యొక్క విభిన్నత, తీవ్రత, లింగము, వయసు, ఆ వ్యక్తుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ పథకాలలో ఈ క్రింద తెలిపిన వాటిని పొందుపరచాలి.

ఎ) రక్షణ, భద్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, కౌన్సెలింగ్ సేవల పరంగా మంచి జీవన ప్రమాణాలు కలిగిన కమ్యూనిటీ సెంటర్లను ఏర్పాటు చేయాలి.

బి) వైకల్యం కలిగి యుండి, అనాథ పిల్లలు, కుటుంబ సభ్యులు విడిచిపెట్టిన పిల్లలు లేదా వసతి లేని పిల్లలు లేదా జీవనోపాధులు ఏమీ లేని పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

సి) వైకల్యం కలిగియున్న మహిళల జీవనోపాధులకు, వాళ్ల పిల్లల పోషణకు అవసరమైన సహాయం అందించాలి.

డి) సురక్షిత త్రాగు నీరు, అనువైన పారిశుద్ధ్య సౌకర్యం కల్పించాలి

ఇ) కుటుంబ ఆదాయం తక్కువగా వున్న వైకల్యం కలిగిన వ్యక్తులకు అవసరమైన సహాయ సామగ్రి, ఉపకరణాలు, మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు, లోపాలు సరిదిద్దే శస్త్ర చికిత్సలు వంటి వాటిని ఉచితంగా అందించాలి. అలానే పెన్షన్ సదుపాయాలను కల్పించాలి.

ఎఫ్) వైకల్యం గల నిరుద్యోగ యువకులు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్‌లో పేర్లు నమోదు చేయించుకొని రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా, వాళ్లకు ఆదాయం అందించే ఎటువంటి ఉపాధి కల్పించలేకపోతే, అలాంటి వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

జి) భారీ మద్దతు (హై సపోర్ట్ నీడ్) అవసరమున్న వైకల్యం గల వ్యక్తుల సంరక్షకులకు అలవెన్స్ మంజూరు చేయాలి.

హెచ్)వైకల్యం గల వ్యక్తులకు సమగ్ర బీమా పథకం వర్తింపజేయాలి.

ఐ) వైకల్యం గల వ్యక్తులకు తగిన ప్రయోజనం అందించగలరని ప్రభుత్వం భావించే ఏ ఇతర ప్రయోజనాలనైనా వర్తింపజేయాలి.

## ఆరోగ్య సేవలు:

1. గ్రామీణ ప్రాంతాల పరిధిలో ప్రకటించబడిన ఆదాయ పరిమితిగలవారికి ఉచిత ఆరోగ్య సేవలు అందించాలి.
2. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల, ఇతర ఆరోగ్య సంస్థల కేంద్రాల అన్ని విభాగాలలో భౌతిక అడ్డంకులు లేని ప్రవేశానికి ఏర్పాటు చేయాలి.
3. వైద్య సేవలు అనగా హాజరులోను, వైద్యంలోను ప్రాధాన్యత ఇవ్వాలి.
4. వైకల్యానికి దారితీసే కారణాలపై పరిశోధన, పరీక్షలు, సర్వేలు నిర్వహించడం.



5. వైకల్య నివారణ కొరకు వివిధ పద్ధతులలో ప్రచారం చేయాలి.
6. కనీసం ఏడాదికి ఒకసారి పిల్లలందరిని క్షుణ్ణంగా పరిశీలించి, వైకల్యం పొందే ప్రమాదం వున్న వారిని గుర్తించడం.
7. ఆరోగ్య కేంద్రాలలో సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేయడం.
8. పరిశుభ్రత, ఆరోగ్యం, పారిశుద్ధ్యం గూర్చి అవగాహన సదస్సుల నిర్వహణను ప్రోత్సహించాలి.
9. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవ అనంతరం తల్లి, శిశువులకు ఆరోగ్య సేవలు అందించాలి.
10. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ప్రమాదకర సమయంలో ఆరోగ్య సేవలందించాలి.
11. వైకల్యం గల మహిళలకు లైంగికపరమైన, పునరుత్పత్తిపరమైన ఆరోగ్య సేవలను ప్రత్యేకంగా అందించాలి.

**బీమా పథకాలు:**

1. వైకల్యం గల ఉద్యోగుల కొరకు సంబంధిత ప్రభుత్వము బీమా పథకాలు రూపొందించాలి.

**పునరావాసము:**

1. వైకల్యం కలిగిన వ్యక్తులందరికీ సంబంధిత ప్రభుత్వాలు వారి ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధిని బట్టి పునరావాస సేవలు, కార్యక్రమాలు ప్రత్యేకించి ఆరోగ్య, విద్య, ఉపాధి రంగాలలో చేపట్టాలి.
2. పునరావాస కార్యక్రమాలకు సంబంధించిన నియమాలను రూపొందించే సమయంలో వైకల్యం గల వ్యక్తుల సంక్షేమం కొరకు పని చేసే ప్రభుత్వేతర సంస్థలను తప్పక సంప్రదించాలి. ఆ సంస్థలకు ఆర్థిక సహాయము అందించాలి.





## సంస్కృతి, వినోదం:

1. వైకల్యం గల వ్యక్తులు సాంస్కృతిక, వినోద, విహార, నృత్య, కళా, సాంఘిక, తదితర కార్యక్రమాలలో పాల్గొనడానికి అవకాశం కల్పించాలి.
2. సంజ్ఞల భాషతో ఆ భాష అనువాదంతోను, సబ్ టైటిల్స్‌తోను టి.వి.కార్యక్రమాలు రూపొందించి బధిరులు పాల్గొనేటట్లు చూడాలి.






## క్రీడా కార్యక్రమాలు:

1. వైకల్యం గల వ్యక్తులకు అన్ని క్రీడలలో అవకాశం, ప్రవేశము, భాగస్వామ్యము వుండేలా కార్యక్రమాలను రూపొందించాలి. వారి వారి వైకల్యాలను బట్టి క్రీడలను ప్రోత్సహించి, అట్టి క్రీడలలో పాల్గొని గెలిచిన వారిని బహుమతులతో సత్కరించాలి.



